కింజరాపు కోటను భూస్థాపితం చేద్దాం



దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా టెక్కలిలో భారీ ర్యాలీ

- వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం
- వైఎస్సార్‌సీపీ పాలనలోనే టెక్కలి నియోజకవర్గం అభివృద్ధి
- భారీ ర్యాలీ మధ్య నామినేషన్‌కు తరలిన దువ్వాడ శ్రీనివాస్
- హాజరైన ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి



దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

టెక్కలి:

దశాబ్దాలుగా ప్రజాధనం దోపిడీ చేస్తూ రూ. వేల కోట్లు సంపాదించుకున్న కింజరాపు కుటుంబం కోటలను ఈ ఎన్నికలతో భూస్థాపితం చేద్దామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ల ర్యాలీ పట్టణంలో హోరెత్తించింది. పాత జాతీయ రహదారిలో వెంకటేశ్వర ఆలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రహదారులన్నీ కిక్కిరిసిపోయి వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. పాత జాతీయ రహదారి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీలో ఒక్క కింజరాపు కుటుంబం స్వార్థపూరిత రాజకీయాలకు పాల్పడుతూ దశాబ్దాలుగా దోపిడీలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సుమారు ఏడు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే 1550 కోట్ల రూపాయలతో సంక్షేమాన్ని చేరువ చేశామని చెప్పారు. ఇటువంటి సంక్షేమ పాలనకు స్వాగతం పలికే విధంగా ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు సభల్లో మాట్లాడుతూ.. తమ హయాంలో ప్రతీ మండలానికి ఒక భవనం కట్టామని ప్రగల్భాలు పలుకుతున్నార న్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో సుమారు 89 భవనాలు కట్టామని గుర్తు చేశారు. టీడీపీ నాయకులకు ఇవే చివరి ఎన్నికలని జోస్యం చెప్పారు. నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. అన్నివర్గాల నుంచి సీఎం వైఎస్ జగన్‌కు అత్యంత ప్రజాదరణ వస్తుండడంతో ప్రతిపక్షాలు ఓర్చులేకపోతున్నాయని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గాన్ని ఎంతో అభివృదిధ చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి అంతా సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్, కాయల వెంకటరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, మండల పార్టీ అధ్యక్షుడు కె.అజయ్‌కుమార్, ఎన్.సత్యరాజ్, కె.సతీష్, టి.ఫాల్గుణరావు, పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కంచిలి: మండలంలోని ఎక్కల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం బి.గిరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, డీజీపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్‌లను దుశ్శాలువలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ జీరు లలిత, స్థానిక సర్పంచ్ రంగాల గాయత్రి, స్థానిక నాయకుడు రంగాల శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది కామేష్‌రెడ్డి, ఉమారావు, జీవిత బెహరా, రూప పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో పరీక్షను ఈ నెల 21న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని వాటితో పరీక్షకు హాజరు కావాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఉదయం తొమ్మిది గంటలకే చేరుకోవాలన్నారు.
ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 21వన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 22వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

22న మంత్రి సీదిరి అప్పలరాజు నామినేషన్

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ నెల 22వ తేదీన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ విషయాన్ని ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు పలాస రైల్వేస్టేషన్ రథయాత్ర మైదానం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

మామిడిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

పలాస: మామిడిపల్లి గ్రామంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 95 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు శిరీషా, అమూల్య రోగులను పరీక్షించారు. ఆస్పత్రి ఏరియా మేనేజరు రాపాక తిరుపతిరావు, పీఆర్వో ప్రదీప్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి అలయ ప్రతిష్ట ప్రారంభం



విద్యుత్ వెలుగుల్లో వేంకటేశ్వరాలయం

టెక్కలి రూరల్: టెక్కలిలో వైభవ వేంకటేశ్వర స్వామి అలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు అర్చక బృందంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొలిరోజున విశ్వేక్షన ఆరాధన, భగవత్ పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, యాగశాలార్చన, అగ్ని ప్రతిష్ఠాపన పూజలు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించి న ఆలయం అందరినీ ఆకర్షించింది.

11న జాతీయ లోక్‌అదాలత్

కాశీబుగ్గ: మే 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు పలాస జూనియర్ సివిల్ కోర్టు సిబ్బంది శుక్రవారం తెలిపారు. లోక్‌అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులు రాజీతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి మల్లా చక్రవర్తి సూచించారు. స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

వలంటీర్లు రాజీనామా

సంతబొమ్మాళి: మండలంలోని వివిధ సచివాలయాలకు చెందిన వందమంది గ్రామ వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. బోరుభద్ర, కె.లింగూడు, మర్రిపాడు, భావనపాడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ ఏడోవార్డు మాజీ కౌన్సిలర్ సీరపు జగన్నాయకులు ఇటీవల చనిపోయారు. దీంతో అతని కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, పార్టీ నేతలు పిలక సంతు, కవిటీ పీఏసీఎస్ అధ్యక్షుడు దేవరాజుసాహు, పి.మధుమూర్తి, వెంకటరమణ, శివమహాపాత్రో ఉన్నారు.

నేడు మంత్రి ఎన్నికల ప్రచారం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారం చేస్తారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఏడో వార్డు చినబాడం, అంతరకుడ్డ గ్రామాల్లో, మధ్యాహ్నం పెసరపాడు, నర్సిపురం, సాయంత్రం 5.30 గంటలకు ఐదోవార్డు తాళభద్ర గ్రామాల్లో మంత్రి ప్రచారం చేస్తారు.

ఊరూరా ప్రచార హోరు..

సార్వత్రిక ప్రచారం పదునెక్కుతోంది. నామినేషన్ల పర్వం కూడా ఆరంభమైపోవడంతో నాయకులు ఊరూవాడా చుట్టేస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ప్రచార జోరు పెంచుతున్నారు. పెద్ద ఎత్తున ర్యాలీలు, ఇంటింటికీ పలకరింపులు, ఆత్మీయ సంభాషణలతో జనాలకు చేరవవుతున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల వారితో కలిసిపోతూ ఎన్నికల సమరానికి సర్వ సన్నద్ధమవుతున్నారు.

ప్రచార పర్వం

కంచిలి: మండలంలోని నువాగడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి నాయకులతో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున ఇంటింటా ప్రచారాన్ని శుక్రవారం చేపట్టారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా పిరియా విజయ, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, స్థానిక సర్పంచ్ సబితా గౌమాంగో, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి పండా, జామి జయ, గోకర్ణపురం సర్పంచ్ యారడి ఆనందరావు, పలికల జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, పాందూరు శ్రీధర్ పాల్గొన్నారు.
సోంపేట: సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీలో ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోదతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, తడక జోగారావు, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యులు పాడుగ కామేష్, నర్తు జానకీ, బి.ధర్మరాజు, నాయకులు మాష్టీల మంజు, కొంచాడ నెహ్రూ, జక్కం ఉదయ్‌కుమార్, కోట్ని శ్రీను, మల్లా వెంకటరమణ ఉన్నారు.




సోంపేటలో ప్రచారం చేస్తున్న పిరియా విజయ తదితరులు



కంచిలి: నువాగడ గ్రామంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సేవకుడిలా పని చేశా.. ఆశీర్వదించండి

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట గ్రామంలో పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ కోసం సేవకుడిలా పని చేశానని.. రానున్న ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించి ఆశీర్వదించాలన్నారు. ప్రచారానికి వచ్చిన మంత్రికి గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. పాండురంగ యువజన సంఘం భవనం వద్ద ప్రచార రథంపై నుంచి ఆయన మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గౌతు కుటుంబం 60 ఏళ్లు పదవులు చేపట్టి ఈ ప్రాంత ప్రజలను పిట్టి పీడించారన్నారు. వారు చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. ఓటు కోసం వస్తే ఏం చేశారో చెప్పాలంటూ నిలదీయాలని మంత్రి అప్పలరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులు వలస పోకుండా ఉండేందుకు ప్రతీ జిల్లాలో ఫిషింగ్ హార్బర్‌లు నిర్మించామన్నారు. మన జిల్లాలో మత్స్యకారులు ఉపాధి కోసం మూలపేట పోర్టుతో పాటు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నామని అన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే రాబోతున్నారని మంచినీళ్లపేట ఫిషింగ్ హార్బర్ సైతం నిర్మించుకుంటామన్నారు. డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ భృతి, మత్స్యకారులు చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇవ్వగలిగామని అన్నారు.
పదేళ్లు ఎంపీగా పని చేసిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్టీల్ కుర్చీలకే పరిమితమయ్యారన్నారు. అలాంటి ఎంపీ మనకు అవసరం లేదన్నారు. సామాన్యుడు, నిగర్వి అయిన పేరాడ తిలక్‌కు ఎంపీగా ఈసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ వంక సత్యరాజులు, వైస్ ఎంపీపీలు వంక రాజు, తమ్మినేని శాంతారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, వంక లక్ష్మయ్య, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బి.కోటేశ్వరరావు, జి.శంభూరావు, ఇరోతు హేమంతరాజు, కర్ని శ్రీను, మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డి కరుణాకర్, ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: బూడిద గుమ్మడికాయలతో దిష్టి తీసి స్వాగతం పలుకుతున్న మంచినీళ్లపేట మత్స్యకార మహిళలు

అమలకుడియాలో మంత్రి ప్రచారం



పలాస: ప్రచారంలో మంత్రి అప్పలరాజు

పలాస: అమలకుడియా పంచాయతీలో శుక్రవారం రాత్రి పలాస ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంటింటా ప్రచారం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ మండల కమిటీ నాయకులు పైల చిట్టిబాబు, ఉంగ సాయిక్రిష్ణ, దువ్వాడ రవి, మచ్చ ధనరాజు, స్థానిక సర్పంచ్ కొర్ల శిరీష, మురళీక్రిష్ణ చౌదరి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న పిరియా సాయిరాజ్

అభివృద్ధికి అండగా నిలవండి

ఇచ్ఛాపురం: అభివృద్ధి ప్రభుత్వానికి ఎన్నికల్లో అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేగా పిరియా విజయ, ఎంపీగా పేరాడ తిలక్‌లను గెలిపించాలని కోరారు. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావుపట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన డిల్లీ, వార్డు కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, మదుమూర్తి, జగన్, జి.ప్రదీప్, పార్టీ నాయకులు పిలక సంతు, కాళ్ల సత్యం, చాట్ల తులసీదాస్, నీలాపు డిల్లీ, లాబాల శంకర్, కాళ్ల మదన్, దేవ, సల్లా దేవరాజు, రెయ్యి నారాయణ, తేజ, కిరణ్‌బెహర, లోకనాథం, యాదవరెడ్డి ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేటలో ప్రచారం చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కొత్తమ్మతల్లికి పూజలు చేసి.. నామినేషన్ వేసేందుకు తరలి..

- ర్యాలీగా వెళ్లిన ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



నందిగాం: కొత్తమ్మతల్లి ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేస్తున్న తిలక్ దంపతులు

నందిగాం: శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్ నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా శ్రీకాకుళం శుక్రవారం తరలివెళ్లారు. స్వగ్రామమైన కణితూరులో ఇంటి దేవత కొత్తమ్మతల్లి ఆలయంలో భార్య, నందిగాం జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవితో కలిసి నామినేషన్ పత్రాలను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానులు, పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా వెళ్లారు.

కోటబొమ్మాళిలో తిలక్‌కు ఘనస్వాగతం

కోటబొమ్మాళి: నామినేషన్ వేసేందుకు బయలుదేరి వెళ్లిన పేరాడ తిలక్‌కు కోటబొమ్మాళి మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక జాతీయ రహదారి కిష్టుపురం జంక్షన్‌లో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తిలక్‌కు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహాసాహెబ్‌పేట సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఎస్.వినోద్ ఉన్నారు.



కోటబొమ్మాళి: పేరాడ తిలక్‌కు ఘనస్వాగతం నాయకులు

పక్కాగా ఎన్నికల వ్యయం నమోదు

- ఎన్నికల వ్యయ పరిశీలక అధికారి నవీన్ కుమార్ సోనీ



ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో మాట్లాడుతున్న నవీన్ కుమార్ సోనీ

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలను నామినేషన్ వేసిన రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు సంబంధిత బృందాలు కచ్చితంగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలక అధికారి నవీన్ కుమార్ సోనీ (ఐఆర్ఎస్) ఆదేశించారు. ఇచ్ఛాపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. సహాయక వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, అకౌంటింగ్ బృందాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆమోదం, ఆమోద యోగ్యం కాని ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని సూచించారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలో అన్నింటినీ వీడియో సర్వేల్నెన టీమ్ సభ్యులు రికార్డింగ్ చేసి పరిశీలన సభ్యుల ద్వారా సదరు వీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీమ్ సభ్యులకు అందజేయాలన్నారు. అకౌంటింగ్ టీమ్ సభ్యులు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర, ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి, తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, ఎంపీడీవో వైవి రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

అభ్యర్థుల ఖర్చులపై పరిశీలకుడి ఆరా

పలాస: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా పలాస నియోజకవర్గంలో ఎన్నికల వ్యయపరిశీలకుడు నవీన్‌కుమార్ సోని శుక్రవారం పర్యటించారు. పలాస నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అభ్యర్థుల ఖర్చు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల అధికారి డాక్టర్ భరత్‌నాయక్, తహసీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కోటబొమ్మాళి: నిమ్మాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అవుతున్న లైన్లకు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో పెద్దబమ్మిడి ఫీడర్ పరిధిలోని చిన్నబమ్మిడి, సుబ్బారావుపేట, వాండ్రాడ, గట్లపాడు, నర్సింగపల్లి గ్రామాలకు శనివారం ఉదయం ఆరు నుంచి పది గంటల వరకూ సరఫరా నిలిపి వేస్తున్నట్టు కోటబొమ్మాళి విద్యుత్‌శాఖ ఏఈ బీవీ సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.